క్లుప్తంగా

చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం చండీహోమం నిర్వహించారు. హోమానికి ఉభయధారులుగా దాటిన శ్రీనివాసరావు, అలివేలు మంగతాయారు దంపతులు, పాశం దివ్యశ్రీ, పామర్తి పద్మావతి, కొప్పుల లక్ష్మీలు వ్యవహరించారు. దాతలు తాతిన శ్రీనివాసరావు, పానుగంటి సత్యనారాయణ, ప్రసన్న డెంటల్ కేర్ యాజమాన్యం, తాటగుంట్ల నాగ ప్రసన్నల సహకారంతో అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారని తెలిపింది.

రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తపడాలి



కిశోర వికాసంలో మాట్లాడుతున్న బ్యూల

జంగారెడ్డిగూడెం: కౌమార దశ బాలికలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో పి.బ్యూల అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం పంచాయతీలో ఎంపీపీ స్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూల మాట్లాడుతూ ఐరన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమ, అంగన్‌వాడీ వర్కర్స్ శ్యామల, దెబోరా, దేవి, స్వప్న, ఆశలు, కిశోర బాలికలు హాజరయ్యారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



అభయాంజనేయస్వామి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 22న గురువారం హనుమాన్ జయంతి వేడుక ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 21వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు స్వామివారికి అభిషేకం, శాంతి కల్యాణం, 22న గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా తమలపాకుల పూజ, మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి ఊరేగింపు, హనుమాన్ శోభ బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపింది. భక్తులు పాల్గొనాలని కోరింది.

ధూప దీప నైవేద్యాలకు విరాళం



అయ్యప్ప ఆలయంలో విరాళం అందజేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్స్ సెంటర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయానికి గవరవరానికి చెందిన తగరం పిరయ్య, జ్యోతి దంపతులు రూ.5 వేలు విరాళం శుక్రవారం అందజేశారు. ఏడాదికి ధూప దీప నైవేద్యాల నిమిత్తం సుమారు రూ.25 వేలు ఖర్చవుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ సంకుకొండ తెలిపారు.

నూకాలమ్మవారికి విశేష పూజలు



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాతలు ఎఫ్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎ.రాజేష్, వాసంతి దంపతులు సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఆలయ కమిటీ మజ్జిగ వితరణ చేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. అమ్మవారి రజత వస్త్రానికి నిమ్మగడ్డ సత్యనారాయణ (బాబీ), విజయలక్ష్మి దంపతులు, నిమ్మగడ్డ రామకృష్ణ, కుసుమ కుటుంబ సభ్యులు 10 తులాల వెండిని సమర్పించినట్టు చెప్పారు. ఈ నెల 19న ఆలయ పునర్నిర్మాణం చేసి ఆరు వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

అయ్యో మామిడి! విధిలేక.. నరికివేత

- చింతలపూడి సబ్ డివిజన్‌లో తోటల నరికివేత
- 50 వేల నుంచి ఏడు వేల ఎకరాలకు పడిపోయిన విస్తీర్ణం



మెట్ట ప్రాంతంలో మామిడి తోటలను నరికి వేస్తున్న దృశ్యం

చింతలపూడి : వరుస ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్లో సరైన గిట్టుబాటు ధరలేక మామిడి రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారిస్తున్నారు. తోటలను నరికివేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో గతంలో సుమారు 50 వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తరించి ఉండేవి. ప్రస్తుతం ఆ విస్తీర్ణం ఏడు వేల ఎకరాలకు పడిపోయింది. అత్యధిక శాతం రైతులు మామిడి తోటలను తొలగించి ప్రత్యామ్నాయంగా పామాయిల్, మొక్కజొన్న, పొగాకు, వేరుశనగ, అరటి వంటి వాణిజ్య పంటలు పండిస్తున్నారు. భవిష్యత్తులో ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదు.

ప్రోత్సాహం కరువు

ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, ద్వారకాతిరుమల ప్రాంతాల్లోనే మామిడి తోటలు ఉన్నాయి. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన మామిడి తోటలు గత కొన్నేళ్లుగా ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లభించకపోవడంతో కుంచించుకుపోతున్నాయి. ఇక్కడ తయారయ్యే బంగెనపల్లి కాయలు నాగపూర్, ఢిల్లీ, కలకత్తా, ముంబయి మార్కెట్లకు తరలించేవారు. అలాగే గల్ఫ్ దేశాలకు కంటైనర్ల ద్వారా ఎగుమతి చేసేవారు. ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరిగేది. దీంతో విదేశీ మారక ద్రవ్యం కూడ వచ్చేది. కాగా విధిలేని పరిస్థితుల్లోనే తోటలను నరికి వేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడ పూత సమయంలోనే తేనె మంచు పురుగు సోకి పూత మాడిపోవడంతో దిగుబడి అంతంత మాత్రంగానే ఉందంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మిగిలిన తోటలను సైతం తొలగించక తప్పదని వాపోతున్నారు. ఈ ప్రాంతం నుంచి మామిడి కలప రాజమండ్రి, భద్రాచలం పేపర్ మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే మామిడి పూర్తిగా అంతరించి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు నాటితే రాయితీ

ప్రభుత్వం కొత్తగా తోటలు వేసుకునే మామిడి రైతులకు 5/5 మీటర్ల వ్యాసార్థంలో మామిడి మొక్కలు నాటుకుంటే హెక్టారుకు రూ.48 వేలు, 7.5/7.5 మీటర్ల వ్యాసార్థంలో నాటుకుంటే హెక్టారుకు రూ.30 వేలు, 3/2 మీటర్ల వ్యాసార్థంలో నాటుకుంటే హెక్టారుకు రూ.72 వేలు, 4/2 మీటర్ల వ్యాసార్థంలో నాటుకుంటే రూ.72 వేలు రాయితీ అందిస్తున్నట్టు ఉద్యానాధికారి ఎండీ షాఫియ ఫర్హీన్ తెలిపారు.

పర్యావరణానికి ముప్పు

మామిడి తోటల నరికితవేత వల్ల పర్యావరణం దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. వాతావరణంలో సమతుల్యత లోపించి పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని మామిడి తోటల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రీడా సామగ్రి అందజేత



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ విద్యార్థులకు బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ఆర్థిక సహకారంతో వాలీబాల్, నెట్ అందించారు. ఈ సందర్భంగా డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ కు చెందిన పేద విద్యార్థులను సాంప్రదాయ క్రీడల వైపు ప్రోత్సహించడానికి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సిబ్బంది అందించిన సహకారం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ఎస్‌డీఈ.సురేష్, ఆర్ఎస్ఎస్ సంతోష్ కుమార్, జెటిఓలు ఎ.వెంకటేశ్వరరావు, వై.ఆంజనేయులు, పీఎస్ఎన్ రాజు, డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు, కార్యదర్శి పటాన్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యం



శ్రీనివాసపురంలో పల్లె నిద్ర నిర్వహిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: ప్రజల భద్రతకే కాదు – గ్రామస్తులతో నేరుగా మానవీయ సంబంధాలు బలపర్చే దిశగా పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ వి.కృష్ణబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామంలో ఎస్సై షేక్ జబీర్‌తో కలిసి ఆయన పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణబాబు మాట్లాడుతూ పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు మెరుగుపరచటమే కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ ప్రజలతోపాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. భద్రత, నేర నివారణ, సైబర్ క్రైమ్, అత్యవసర సేవలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930కు, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు, గోప్యమైన సమాచారం తెలిపేందుకు ఎస్పీ వాట్సాప్ నంబర్ 9550351100కు, మాదక ద్రవ్యాల నివారణకు టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం తెలియజేసి సేవలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



యర్రగుంటపల్లిలో దగ్ధమైన పొగాకు బ్యారన్

చింతలపూడి : మండలంలోని యర్ర గుంటపల్లి గ్రామంలో తెగడ ముత్తయ్య అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ శుక్రవారం ప్రమాద వశాత్తూ దగ్ధమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ముత్తయ్య కోరారు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు తెరిచే నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. బుట్టాయగూడెం మండలం తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నేటి నుంచి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులందరూ గ్రామాల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను గుర్తించి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో అందిస్తోన్న సౌకర్యాలను, పాఠ్యాంశ విధానాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ ఎం శ్రీవిద్య, డీవైఈఓ జి.రామ్మోహన్‌రావు, ఏఎంఓ కె. శిరమయ్య, జీలుగుమిల్లి ఏటీడబ్ల్యూఓ జనార్దన్, ఐటీడీఏ పరిధిలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నారసింహుని ఆలయానికి భూమి అప్పగింత



భూమి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఐఎస్ జగన్నాథపురంలోని ఆర్ఎస్ నెంబర్ 425 – 193లోని 30 ఎకరాలు ఉచితంగా కేటాయించింది. సదరు భూమి అప్పగింత పత్రాలను నారసింహుని ఆలయం వద్ద ద్వారకాతిరుమల దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తహసీల్దార్ జేవీ సుబ్బారావులు అప్పగించారు. తొలుత ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు తదితరులున్నారు.

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

కుక్కునూరు: నిర్వాసితులు, కార్మికుల, గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం పార్టీ ముఖ్య కార్యకర్తల శిక్షణ తరగతులు యర్నం సాయికిరణ్ అధ్యక్షతన కుక్కునూరులో నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మానుకొండ జీవరత్నం, వై.నాగేంద్రరావు, సత్యవతి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు రిలే దీక్షలు



బుట్టాయగూడెంలో దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: గిరిజనులకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటించాలని, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాని, గిరిజన ప్రాంతంలో ఉద్యోగ నియామక చట్టం చేయాలని, ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. మెగా డీఎస్సీ – 2025లో ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను నోటిఫికేషన్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలో సుమారు 15 మంది పైగా కూర్చొగా, కార్యక్రమంలో జేఏసీ నాయకులు మడకం రమేష్, బుధుల నాగేంద్రబాబు, కణితి శ్రీకాంత్, నింజా వెంకన్నబాబు, కొమరం రాము, మడకం దుర్గారావు, గోరం పెంటారావు, బన్నె వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

లింగపాలెం: మండలంలోని భక్తి ఆధ్యాత్మిక సేవా సంస్థ భాగవత సదనం వారు రంగాపురం, ముడిచర్ల, వేములపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి శుక్రవారం ద్వారకాతిరుమల నడక భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఈ సేవ రామానుజాచార్యుల జయంతి రోజున ప్రారంభమై నెల రోజులు ఉంటుందని, కూలింగ్ వాటర్‌ను సంఘ సభ్యుడు శ్రీమాన్ తడికమళ్ల ప్రసాద్ అందిస్తున్నారు. భాగవత సదన ప్రతినిధులు శ్రీమాన్ రావి సత్యనారాయణ, చంద్రుపట్ల నాగేశ్వరరావు, మద్దుల సర్వేశ్వరరావు, మద్దుల సత్యనారాయణ, చక్కా సీతారామగుప్తా, మహిళా భాగవతులు, పిల్లలు పాల్గొన్నారు.

కోడిగూడెంలో ఉచిత వైద్య శిబిరం



వ్యక్తికి గుండె పరీక్ష చేస్తున్న డాక్టర్

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెంలో శివాజీ ట్రస్ట్ చైర్మన్ బాతుల వేణు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వేణు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రముఖ వైద్యుడు వేణు 200 మంది రోగులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కనికెల్లి ప్రసాద్, మానుకొండ వెంకటరత్నం, మానుకొండ జీవన్, కందికొండ మధు, డొక్కా సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇండోర్ రోయింగ్ క్యాంప్



క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న బాలురు



శిక్షణ పొందుతున్న బాలికలు

ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీలో ఈనెల 1న ప్రారంభమైన ఉచిత ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను బాలలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఏలూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో క్యాంప్ కోచ్, ఇన్‌చార్జి, జాతీయ స్థాయి రోయింగ్ క్రీడాకారుడు ఊదర్ల విజయ్ శిక్షణ ఇస్తున్నారు. గత ఏడాది 80 మంది పిల్లలకు శిక్షణ ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్య 100కు చేరిందని విజయ్ తెలిపారు. ఆఖరిలో స్పోర్ట్ అథారిటీ వారి ప్రశంసా పత్రాలు, విజేతలకు మెడల్స్‌ను అందిస్తామన్నారు. తనకు స్క్యాల్లింగ్ – రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తరుణ్ కాకాని, కార్యదర్శి ఎస్ పవన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు జోషిలు సహకరిస్తున్నారని విజయ్ తెలిపారు.

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో డెంగీ నివారణ అవగాహన కార్యక్రమం

కొయ్యలగూడెం: జాతీయ డెంగీ నివారణా దినోత్సవాన్ని బయ్యనగూడెం పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించారు. వైద్యధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైరులు, వాడేసిన డిస్పోజబుల్ టీ, మంచి నీటి గ్లాసులు, ఫ్రిజ్ వెనుక నీటిని తొలగించుకుంటే డెంగీని నివారించవచ్చని అన్నారు. మరో వైద్యాధికారిణి ఎం గీతారాణి మాట్లాడుతూ అవగాహనతోనే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ శైలజ, హెఎస్ బాషా, హెచ్‌వీ మరియమ్మ, ఫార్మసిస్ట్, ఎల్‌టి, స్టాఫ్ నర్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని శ్రీ సీతారామ కాలక్షేప కల్యాణ మండపంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందించారు. తహసీల్దార్ కె.స్లీవ జోజి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, ఎస్సై షేక్ జబీర్ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు నవోదయం



నవోదయం 2.0 కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారిణి

పోలవరం రూరల్: సారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో పోలవరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సారా తయారీ విక్రయాలతో జీవనం సాగించేవారు నవోదయం 2.0 ద్వారా ప్రత్యమ్నాయంగా ఉపాధి పొందేటట్ల చర్యలు చేపడతామన్నారు. అర్హులకు వెలుగు ద్వారా ఉపాధి పొందేటట్ల చూడాలని ఏపీఎంలకు సూచించారు. డీఆర్‌డీఏ పీఎం ఇ.అనిత మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ఉండి అర్హత ఉన్న వారికి బ్యాంకు లింకేజ్ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ వంటి పథకాల ద్వారా రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రాజబాబు, ఉన్నతి ఏపీఎం సుమతి, పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాల వెలుగు ఏపీఎంలు జేమ్స్, శ్రీనివాస్, పద్మావతి, కైకలూరు ఎక్సైజ్ సీఐ రమేష్, మండల సమైక్య సీసీలు, ఉన్నతాధికారులు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన కల్పించాలి

కలెక్టరు వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మే నెలలో వేడిని ఓడించండి ఇతివృత్తానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు శనివారం పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లల్లో వాతావరణంపై అవగాహన పెంపొందించడానికి బీట్ ది హీట్ అనే ఇతివృత్తంపై డ్రాయింగ్, వ్యాచరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నీటిని సంరక్షించడానికి కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో వర్షపు నీటిని సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. వృద్ధులు, పిల్లలు, కార్మికులు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాలు, కాలనీలు, ఇతర నిర్మాణ పనుల ప్రాంతాల్లో చలివేంద్రాలు, షెడ్ నెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. బస్సు స్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, మతపరమైన ప్రదేశాలు, మార్కెటు ప్రాంతాల్లో షెడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, సీపీఓ వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి ఆర్ మాలిని, డీఈఓ కె.వెంకటలక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, ఉద్యానవన శాఖ డీడీ ఎస్.రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్సీ నాగార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు, పరిశ్రమల శాఖ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి, పశుసంవర్ధక శాఖ జెడీ గోవిందరాజులు, మున్సిపల్ కమిషనరు భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి గాయాలు

పోలవరం రూరల్: పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో తేనెటీగలు దాడి చేయడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన మహేష్, రాజు, శాంతి, సతీష్, మరియమ్మలు పోలవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వారి సొంత పనుల నిమిత్తం వచ్చారు. ఉదయం కార్యాలయం సమీపంలో ఉన్న తేనెటీగల పుట్ట నుంచి ఒక్కసారి తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, చికిత్స అందించినట్టు డాక్టర్ కృష్ణరాజు తెలిపారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: మండలంలోని బర్లమడుగు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు ఎల్ఎస్ఎం మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, దుస్తులు, వంటసామాన్లు, రూ.4 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఎం సభ్యులు జక్కుల రాంబాబు, ఫాస్టర్స్ ఫెలో షిప్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.